తెలంగాణ గిరిజన బిడ్డకు
యువ పురస్కారం

2024కుగాను సాహిత్య అకాడమీ ప్రకటన

చంద్రశేఖర్ ఆజాద్‌కు బాల సాహిత్య అవార్డు

రమేశ్ కార్తీక్

న్యూఢిల్లీ, జూన్ 15: నిజామాబాద్ జిల్లా యువ రచయిత, గిరిజన బిడ్డ రమేశ్ కార్తీక్ నాయక్(26)కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. ఈ ఏడాది వివిధ భాషల్లో అత్యుత్తమ రచనలు చేసిన రచయితలకు శుక్రవారం యువ, బాల సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. ఇంగ్లీష్ రచయిత కే వైశాలీ, హిందీ రచయిత గౌరవ్ పాండే సహా 23 మంది రచయితలను యువ సాహిత్య పురస్కార అవార్డులకు ఎంపిక చేసింది. అలాగే 24 మందిని బాల సాహిత్య పురస్కారాలకు ఎంపిక చేశారు. జావేద్ అంబర్ మిషాబీకి ఉర్దూలో యువ సాహిత్య పురస్కారం లభించగా; బాల సాహిత్య పురస్కారం అందుకున్న వారిలో పీ చంద్రశేఖర్ ఆజాద్(తెలుగు), షాంశూల్ ఇస్లామ్ ఫరూఖి(ఉర్దూ) ఉన్నారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న రమేశ్ కార్తీక్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ తెలుగు, ఇంగ్లీష్ చేశారు. ప్రస్తుతం దూరదర్శన్‌లో సాహిత్య కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. యువ, బాల సాహిత్య పురస్కారాల కింద విజేతలకు రూ.50 వేల నగదు, రాగి ఫలకాన్ని అందజేస్తారు.

రమేశ్ కార్తీక్‌కు కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన తెలంగాణ బిడ్డ రమేష్ కార్తీక్‌నాయక్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. రమేశ్ కార్తీక్ నాయక్ రచించిన 'డావ్లో-గోర్ బంజారా కథల' సంకలనానికి అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. రమేశ్ కార్తీక్ నాయక్ మరిన్ని పురస్కారాలను ఆందుకోవాలని, తెలంగాణ ఖ్యాతిని చాటాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

అడ్మిషన్ రద్దు చేసుకుంటే
పూర్తి ఫీజు రీఫండ్

న్యూఢిల్లీ: కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు/ మైగ్రేషన్స్‌ను సెప్టెంబరు 30 నాటికి రద్దు చేసుకున్న విద్యార్థులకు వారు చెల్లించిన ఫీజును పూర్తిగా తిరిగి ఇచ్చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తెలిపింది. అక్టోబరు 31నాటికి రద్దు చేసుకున్నవారికి రూ.1,000కి మించకుండా తగ్గించుకుని, మిగిలిన ఫీజును తిరిగి ఇచ్చేయాలని చెప్పింది. మార్గదర్శకాలు/ ప్రాస్పెక్టస్/ నోటిఫికేషన్/ షెడ్యూలులో ఏది ఉన్నప్పటికీ ఈ విధంగా ఫీజును రీఫండ్ చేయాలని వివరించింది. యూజీసీ కార్యదర్శి మనీష్ ఆర్ జోషీ ఈ నెల 12న ఈ మేరకు ఓ సర్క్యులర్‌ను జారీ చేశారు.

యూజీసీ నెట్ అడ్మిట్ కార్డులు విడుదల

యూజీసీ నెట్-2024 పరీక్ష అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విడుదల చేసింది. ఈ నెల 18న 83 సబ్జెక్టులో ఈ పరీక్ష ఉంటుంది. అధికారిక వెబ్‌సైట్ https:// ugcnet.nta.ac.in/లో అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్టీఏ తెలిపింది. అడ్మిట్‌కార్డుతోపాటు అండర్‌టేకింగ్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏమైనా సమస్య తలెత్తితే.. 011-40759000 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ugcnet@nta.ac.inకు ఈమెయిల్ చేయాలని పేర్కొన్నది.

5 గ్యారెంటీల అమలుకు
పెట్రో వాత

- లీటర్ పెట్రోల్, డీజిల్ ధర రూ.3 చొప్పున పెంపు
- కర్ణాటకలో సేల్స్ ట్యాక్స్ పేరిట వడ్డింపుల పర్వం
- ప్రజలపై భారం మోపుతున్న కాంగ్రెస్ సర్కార్
- స్కీమ్‌ల అమలు కోసం ప్రజల జేబులకు చిల్లు
- నెక్స్ట్ తెలంగాణలోనే.. సోషల్‌మీడియాలో కామెంట్లు

కర్ణాటకలో అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయలేక ఆపసోపాలు పడుతున్నది. 'కాదేదీ పన్నులకు అనర్హం..' అన్నట్టుగా సిద్ధరామయ్య సర్కార్ ప్రవర్తిస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచేసింది. దీంతో ఐదు గ్యారెంటీల అమలుకు అవసరమైన నిధుల కోసం తమ జేబులకు చిల్లు పెట్టడం ఏంటని రాష్ట్ర ప్రజలు హస్తం పార్టీ సర్కార్‌ను నిలదీస్తున్నారు. 'రేపు మా పరిస్థితి కూడా ఇంతేనా?' అని తెలంగాణలోని సామాన్యులు ఇప్పుడు దిక్కులు చూసే పరిస్థితి దాపురించింది.



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలపై పన్నుల వాతను కొనసాగిస్తున్నది. ఐదు హామీల అమలుకు అవసరమైన నిధుల కోసం సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నది. పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచుతూ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 25.92 నుంచి 29.84 శాతానికి (3.92 శాతం పెరుగుదల), డీజిల్‌పై 14.3 శాతం నుంచి 18.4 శాతానికి (4.1 శాతం పెరుగుదల) పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. తాజా పెంపు వెంటనే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది. సేల్స్ ట్యాక్స్ పెంపుతో ఏటా రాష్ట్ర ఖజానాకు రూ.2,500-2,800 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ఆర్థికశాఖ అధికారి ఒకరు పేర్కొన్నట్టు మనీ కంట్రోల్ న్యూస్ వెబ్‌సైట్ వెల్లడించింది.

ఐదు గ్యారెంటీల కోసమే

నిరుడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో ఊదరగొట్టిన కాంగ్రెస్.. ఎట్టకేలకు అధికారంలోకి వచ్చింది. అయితే, ఆ హామీలను అమలు చేయాలంటే రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.52 వేల కోట్ల భారం పడుతుంది. దీంతో గ్యారెంటీల అమలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోడానికి ఛార్జీల పెంపు, పన్ను వసూళ్లకు సర్కారు తెగబడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీసింది. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహ లక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించింది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చింది. బస్సు సర్వీసులను తగ్గించింది. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నది.

తర్వాత తెలంగాణలోనేనా?

ఆరు గ్యారెంటీల పేరిట అలవిగాని హామీలనిచ్చి తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో కర్ణాటక మాదిరిగానే హామీల అమలు పేరిట ఇక్కడ కూడా పన్నుల వాతకు రేవంత్ సర్కారు యోచించవచ్చని సోషల్ మీడియాలో పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అదే జరిగితే, ఆర్థికంగా తమ పరిస్థితి మరింత దిగజారుతుందని సామాన్యులు భయపడుతున్నారు.

ఏడాదిలో కర్ణాటకలో పన్నుల వాత

- పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ - 4 శాతం పెంపు
- గైడెన్స్ వాల్యూ ట్యాక్స్ - 15 నుంచి 30% పెంపు
- దేశీయ లిక్కర్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ - 20 శాతం పెంపు
- బీర్లపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ - 175 నుంచి 185 శాతం పెంపు
- కొత్తగా రిజిస్టరైన రవాణా వాహనాలపై అదనపు సెస్ - 3 శాతం పెంపు
- రూ.25 లక్షల పైబడిన ఎలక్ట్రికల్ వాహనాలపై లైఫ్‌టైమ్ ట్యాక్స్ విధింపు

18న రైతులకు పీఎం కిసాన్ నిధులు

న్యూఢిల్లీ: ఈనెల 18న 17వ విడత పీఎం కిసాన్ నిధులు జమ చేయనున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. వారణాసిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ రూ.20 వేల కోట్ల నిధులను విడుదల చేస్తారని తెలిపారు. వ్యవసాయ పద్ధతుల్లో రైతులకు సహకారాన్ని అందించేందుకు 'కృషి సఖి'లుగా శిక్షణ పూర్తి చేసుకున్న 30 వేల మందికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

'ఎన్డీయే సర్కారు ఎప్పుడైనా పడిపోవచ్చు'

బెంగళూరు: కేంద్రంలో మోదీ ప్రభుత్వం పొరపాటున ఏర్పడిందని, ఏ సమయంలోనైనా ప్రభుత్వం కూలిపోవచ్చని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ మోదీకి ప్రజామోదం లేదని, కేంద్రంలో మైనార్టీ ప్రభుత్వం ఉందన్నారు. అయితే తాము ఈ ప్రభుత్వం కొనసాగాలని, దేశానికి మంచి చేయాలని కోరుకుంటున్నామని అన్నారు. దేశాన్ని బలోపేతం చేసేందుకు కలిసి పని చేస్తామని అన్నారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై తప్పుపట్టారు. ఖర్గే మూర్ఖుల లోకంలో జీవిస్తున్నాడని, మోదీ ప్రభుత్వం ఎప్పటికీ పడిపోదని పేర్కొన్నారు.

దర్శన్ కస్టడీ పొడిగింపు
అతని ప్రియురాలు, మరో 11 మందికి సైతం...

బెంగళూరు: హత్య కేసులో కన్నడ హీరో దర్శన్ పోలీస్ కస్టడీని మరో ఐదు రోజులు పొడిగించారు. అతని ప్రియురాలు పవిత్రా గౌడ, మరో 11 మంది కస్టడీని కూడా న్యాయస్థానం శనివారం పొడిగించింది. వీరికి విధించిన ఆరు రోజుల పోలీస్ కస్టడీ ఆదివారంతో ముగియనుండటంతో కోర్టులో హాజరుపర్చారు. నిందితులను ఇంకా ప్రశ్నించాల్సి ఉన్నందున పోలీస్ కస్టడీని పొడిగించాలని దర్యాప్తు అధికారులు కోరారు. కస్టడీని ఈ నెల 20 వరకు జడ్జి పొడిగించారు.

మణిపూర్ సీఎం పొరుగింట్లో అగ్ని ప్రమాదం

ఇంఫాల్: మణిపూర్ సీఎం ఎన్ బీరేన్ సింగ్ అధికారిక నివాసం సమీపంలోని ఓ ఇంట్లో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఇల్లు గోవా మాజీ ప్రభుత్వ కార్యదర్శి టీ కిప్జెన్‌కు చెందినది. అయితే ఓ ఏడాది నుంచి దీనిని ఖాళీగా వదిలేశారు. ప్రమాదానికి కారణం ఏమిటో తెలియాల్సి ఉంది. మూడు అగ్నిమాపక వాహనాలు దాదాపు ఓ గంటసేపు శ్రమించి, మంటలను ఆర్పేశాయి.

బీజేపీ హయాంలో వందలాది రైతుల ఆత్మహత్య
సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ ఆరోపణ

లక్నో, జూన్ 15: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వ హయాంలో వందలాది రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన లక్నోలో మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల రైతులు, యువత తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించడం లేదని, మరోవైపు పెట్టుబడి ఖర్చు పెరిగిపోయి వారు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు. ఎతావాహ్‌లో వడ్డీ వ్యాపారుల వేధింపుల వల్లనే యువ రైతు వికాస్ జాటవ్(30) ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు.

కేజ్రీ వాదన వీడియో తొలగించండి
ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ భార్య సునీతకు ఢిల్లీ హైకోర్టు శనివారం నోటీసులిచ్చింది. మద్యం పాలసీ కేసులో కోర్టు ప్రొసీడింగ్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా రికార్డు చేసిన వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశించింది. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఈడీ మార్చి 28న ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తన అరెస్టు అక్రమమని వాదనలు వినిపించారు. సునీతతో పాటు సోషల్ మీడియా సంస్థలు ఎక్స్, మెటా, యూట్యూబ్‌లకు కూడా నోటీసులు జారీ చేసింది.

21 సెకన్లలో మూత్ర విసర్జన ఆరోగ్యకరం

న్యూఢిల్లీ: మూత్ర విసర్జనకు పట్టే సమయాన్ని బట్టి ఆరోగ్య స్థితిని గుర్తించవచ్చని పరిశోధకులు గుర్తించారు. మూత్రాశయాన్ని పర్యవేక్షిస్తూ, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఓ చిన్న చిట్కా ఉందని వారు తెలిపారు. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్వహించిన అధ్యయనం ఈ చిట్కాకు ప్రేరణనిచ్చింది. మనుషులు సుమారు 21 సెకండ్లలో మూత్ర విసర్జనను పూర్తి చేయడం ఆరోగ్యకరమని ఈ అధ్యయనం వెల్లడించింది. పదేపదే మూత్రవిసర్జన చేసినా, తక్కువసార్లు చేసినా ఆరోగ్యానికి నష్టమేనని తేలింది.

పుణె కారు కేసులో దన్వడే లీలలెన్నో!

పుణె: పుణె కారు యాక్సిడెంట్ కేసులో నిందిత మైనర్ బాలుడిని విడుదల చేయడంలో జువెనైల్ జస్టిస్ బోర్డ్ (జేజేబీ) పరస్పర విరుద్ధంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. ఈ మేరకు విచారణ కమిటీ సామాజిక న్యాయ శాఖకు 100 పేజీల నివేదిక సమర్పించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. బాలుడికి జేజేబీ నాన్ జ్యుడిషియల్ సభ్యుడు ఎల్ఎన్ దన్వడే బెయిల్ మంజూరు చేశారు. రోడ్డు భద్రతపై 300 పదాలతో వ్యాసం రాయాలని, రూ.15 వేల పూచీకత్తు సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన 15 గంటల్లోనే ఈ తీర్పు చెప్పి నిందితుడిని వదిలిపెట్టారు. రక్త నివేదికలోని లోపాలను దన్వడే పరిశీలించలేదని నివేదిక చెప్పింది. నిబంధనల ప్రకారం రోస్టర్‌ను తయారు చేయకుండా తీర్పు ప్రకటించారని తెలిపింది. జేజేబీ సభ్యులు హాజరు కాకపోయినప్పటికీ, దన్వడే ఒక్కరే విచారణ జరిపి, బాలుడిని విడుదల చేసినట్టు వివరించింది. లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నందున మర్నాడే దన్వడే తీర్పును జేజేబీ ధర్మాసనం రద్దు చేసి ఉండాల్సిందని తెలిపింది. జేజేబీ సభ్యులందరికీ షోకాజ్ నోటీసులను ఇచ్చినట్లు తెలిపింది.

అంగట్లో నీట్ పేపర్

మొదటిపేజీ తరువాయి...

వసూలు చేసినట్టు నిందితులు పోలీసులకు ఇచ్చి వాంగ్మూలంలో అంగీకరించారు. దీంతో మరింత లోతైన విచారణ జరిపేందుకు లీక్ అయిన పేపర్లు పొందారని భావిస్తున్న తొమ్మిది మంది విద్యార్థులను విచారణకు హాజరు కావాలని బీహార్ ఆర్థిక నేరాల విచారణ విభాగం(ఈఓయూ) నోటీసులు జారీ చేసింది.

కీలక విషయాలు వెల్లడించిన నిందితులు

నీట్-యూజీ పరీక్షలో అక్రమాల ఆరోపణలతో బీహార్ ఈఓయూ ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసింది. పోలీసుల ముందు నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు తాజాగా బయటకు వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీహార్ ప్రభుత్వంలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేసే సికందర్ కుమార్ యదవేందు(56).. తాను పలువురు నీట్ విద్యార్థుల కుటుంబాలతో ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించి బేరం కుదుర్చుకున్నానని తన స్టేట్‌మెంట్‌లో అంగీకరించాడు. నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ అనే వ్యక్తులకు పరీక్షకు ఒకరోజు ముందే మే 4న ప్రశ్నాపత్రాలు అందాయని, పట్నాలోని రామకృష్ణానగర్‌లోని ఒక ఇంటికి విద్యార్థులను తీసుకెళ్లి ఈ ప్రశ్నాపత్రాలు ఇచ్చామని ఒప్పుకున్నాడు. విద్యార్థులకు ఈ ప్రశ్నలకు జవాబులను బట్టీ పట్టించారని, ఈ వ్యవహారం ఎక్కడా బయటకు పొక్కకుండా ఉండేందుకు వీరే నేరుగా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల వద్ద దిగబెట్టారని పోలీసులు గుర్తించారు.

కోచింగ్ సెంటర్ల ముసుగులో బేరాలు

నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ కూడా పేపర్ లీకేజీ వ్యవహారంలో తమ ప్రమేయాన్ని అంగీకరించారు. ఇందుకు గానూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.30-32 లక్షలు అందుకున్నట్టు తమ స్టేట్‌మెంట్‌లలో ఒప్పుకున్నారు. వీరిలో నితీశ్ కుమార్ గతంలో బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలో అక్రమాల ఆరోపణలతో జైలుకు వెళ్లి వచ్చాడు. అమిత్ ఆనంద్ పట్నాలో అనుమతి లేకుండా ఒక కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. వీరిద్దరు కన్సల్టెన్సీలు, కోచింగ్ సెంటర్ల ముసుగులో విద్యార్థులను ఆశ్రయించి పేపర్ లీక్ చేస్తామని బేరాలు కుదుర్చుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అసలు వీరికి ప్రశ్నాపత్రాలు ఎలా లీక్ అయ్యాయి? లీక్ అయినవి అసలైన ప్రశ్నాపత్రాలేనా ? అనే దిశగా విచారణ జరుగుతున్నది. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని బీహార్ ఈఓయూ అరెస్టు చేసింది. వీరిలో నలుగురు విద్యార్థులు. ఇప్పుడు మరో తొమ్మిది మంది విద్యార్థులకు ఈఓయూ నోటీసులు జారీ చేసింది. బీహార్‌లోని వేర్వేరు జిల్లాలకు చెందిన వీరిని జూన్ 17, 18న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మరోవైపు నీట్-యూజీ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరుతూ 20 మంది విద్యార్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నీట్‌పై పట్నాలో ధర్నా చేస్తున్న విద్యార్థిపై లాఠీ ఝుళిపిస్తున్న పోలీస్

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్
8 మంది మావోయిస్టులు మృతి

- **మరణించిన వారిలో ముగ్గురు మహిళా మావోయిస్టులు**
- **ఎదురు కాల్పుల్లో ఓ జవాన్ మృతి, మరో ఇద్దరికి గాయాలు**

కొత్తగూడెం క్రైం, జూన్ 15 : మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులతోపాటు ఓ జవాన్ మృతిచెందాడు. మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో శనివారం చోటు చేసుకుంది. నారాయణ్‌పూర్, కొండగావ్, కాంకేర్, దంతేవాడ డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ 53వ బెటాలియన్, బీఎస్ఎఫ్ 135వ బెటాలియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో సాయుధులుగా ఉన్న మావోయిస్టులు తారసపడి జవాన్లపై మెరుపు వేగంతో కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు తేరుకుని ఎదురు కాల్పులు ప్రారంభించాయి. ఇరువర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 8 మంది మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ఒక ఇన్‌సాస్ రైఫిల్, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్‌తోపాటు ఆయుధ వస్తు సామగ్రిని భారీగా జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల కాల్పుల్లో ఒక ఎస్టీఎఫ్ జవాన్ మృతి చెందగా, మరో ఇద్దరు ఎస్టీఎఫ్ జవాన్లు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నాలుగు వేల కోట్ల విలువైన యూనివర్సిటీ జప్తు

- **పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ హాజీపై ఈడీ చర్యలు**
- **బీఎస్పీ హయాంలో నిందితుడికి పలుకుబడి**

లక్నో: బీఎస్పీ మాజీ ఎమ్మెల్సీ, గ్యాంగ్‌స్టర్ హాజీ ఇక్బాల్‌కు చెందిన గ్లోబల్ యూనివర్సిటీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. దీని విలువ రూ.4,440 కోట్లు ఉంటుంది. హాజీ 2007-12 మధ్య కాలంలో బీఎస్పీ ప్రభుత్వంలో ఎంతో పలుకుబడి, ఆధిపత్యం కలిగి ఉండేవారు. ఆయన యూపీలోని మీర్జాపూర్ ప్రాంతంలో 121 ఎకరాల్లో గ్లోబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. నదులను ఆక్రమించుకుని మరీ దాన్ని నిర్మించారు. ఆయనకు సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వంలోనూ బాగా పలుకుబడి ఉండేది. ఆయన ఆక్రమాల గురించి అందరికీ తెలిసినప్పటికీ, గత ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. 2017 నుంచి ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసులు నమోదవుతున్నాయి. పోలీసులు ఆయన తమ్ముడిని, నలుగురు కుమారులను అరెస్ట్ చేయగలిగారు. కానీ హాజీ ఇక్బాల్ ఆచూకీ మాత్రం ఇప్పటికీ దొరకడం లేదు.

టెంపో లోయలో పడి 14 మంది మృతి
ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

న్యూఢిల్లీ, జూన్ 15: ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. 23 మంది ప్రయాణికులతో వెళ్తున్న టెంపో అదుపుతప్పి లోయలోకి జారి కింద ప్రవహిస్తున్న అలకానంద నదిలో పడిన ప్రమాదంలో 14 మంది మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. రిషికేశ్-బద్రినాథ్ హైవేపై రుద్రప్రయాగ్ జిల్లాలోని రైటోలి సమీపంలో టెంపోకు శనివారం ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రోడ్డుపక్కన నిల్చున్న పలువురికి గాయాలు అయ్యాయి. విపత్తు రక్షక బృందాలు సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. తీవ్రంగా గాయపడిన వారిని ఎయిర్ అంబులెన్స్ ద్వారా రిషికేశ్ ఎయిమ్స్‌కు తరలించారు. మిగిలినవారిని స్థానిక దవాఖానలకు తరలించారు. ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ ద్వారా విచారణ జరపాలని ఆదేశించారు.

తలకిందులుగా త్రిశంకు నరకంలో !

న్యూయార్క్: అమెరికాలోని పోర్ట్ లాండ్‌లో ఒక ఎమ్యూజ్‌మెంట్ పార్కులో అట్మాస్ ఫియర్ రైడ్ శుక్రవారం కొంతమందిని ఆకాశంలో తలకిందులుగా వేలాడదీసి భయోత్పాతం సృష్టించింది! చక్రం ఆకారంలో ఉండే ఈ రైడ్ కొన్ని వందల అడుగులు పైకి వెళ్లిన తర్వాత సాంకేతిక లోపంలో ఆగిపోవడంతో అందులో కూర్చున్న వారు అరగంటకు పైగా తలకిందులుగా వేళ్లాడుతూ రక్షించమంటూ ఆర్తనాదాలు చేశారు. అత్యవసర బృందాలు వచ్చి 28 మందిని సురక్షితంగా కిందకు దించాయి.

వీర్యంలోనూ మైక్రో ప్లాస్టిక్

- చైనా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- పరిశోధించిన అన్ని శాంపిల్స్‌లోనూ పాజిటివ్
- శుక్ర కణాల కదలికలను అడ్డుకొంటున్న ప్లాస్టిక్
- పురుష సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మనిషి ఆరోగ్యంపై పలు విధాలుగా దుష్ప్రభావం చూపుతున్నాయి. ప్రమాదకరమైన మైక్రోప్లాస్టిక్ రక్కసి శరీరంలోని అన్ని అవయవాలకు పాకుతున్నది. ఇటీవల న్యూమెక్సికో వర్సిటీ పరిశోధకులు పురుషుడి వృషణాల్లో మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించగా.. తాజాగా చైనా పరిశోధకులు వీర్యకణాల్లోనూ ఈ ప్లాస్టిక్ కణాలు ఉన్నట్టు తేల్చారు. చైనాకు చెందిన ఆరోగ్యవంతులైన 36 మంది యువకుల శుక్రకణాలను ప్రయోగశాలలో విశ్లేషించగా, అన్ని నమూనాల్లో మైక్రోప్లాస్టిక్ రేణువులు ఉన్నట్టు గుర్తించారు. ఈ వివరాలు 'సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్‌మెంట్'లో జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

శుక్ర కణాల కదలికలపై ప్రభావం

*ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, బ్యాగుల తయారీలో వాడే పాలీఇథైలిన్ (పీఈ), పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ), పాలీస్టైరీన్ వంటి రేణువులను వీర్యంలో గుర్తించినట్టు పరిశోధకులు తెలిపారు. సంతానోత్పత్తికి కీలకమైన శుక్ర కణాల కదలికలను ప్లాస్టిక్ రేణువులు అడ్డుకొంటున్నాయని, శుక్ర కణాల ఎదుగుదల, నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అందోళన వ్యక్తం చేశారు. ఇటలీలో నిర్వహించిన మరో అధ్యయనంలోనూ పురుషుల శుక్ర కణాల్లో మైక్రోప్లాస్టిక్‌ను గుర్తించినట్టు పరిశోధక